## ఉద్యోగ కల్పనలో భారత్ భేష్

న్యూఢిల్లీ : గత ఆరు నెలలుగా వివిధ రంగాలకు చెందిన సంస్థలు నియామకాలను తిరిగి చేపడుతున్న క్రమంలో, ఉద్యోగావకాశాలను అందించడంలో భారత్ ముందు ఉందని అని గ్లోబల్ స్టాఫింగ్ సేవల సంస్థ మ్యాన్‌పవర్ ఇండియా జరిపిన ఓ సర్వేలో తేల్చింది ఈ సంస్థ తన త్రైమాసిక ఉద్యోగావకాశాలపై జరిపిన సర్వేలో భారత్‌లోని బహుళజాతి సంస్థలు మెరుగైన అవకాశాలను కల్పిస్తున్నాయని పేర్కొంది. గత త్రైమాసికంతో పోలిస్తే ఏప్రిల్-జూన్ నెలల కాలంలో 4శాతం అధికంగా ఉద్యోగ నియామకాలు జరగనున్నాయని తెలిపింది. సర్వే చేసిన 36 దేశాలతో పోలిస్తే భారత్ ఉద్యోగ నియామకాలను చేపట్టడంలో సానుకూల వాతావరణం కల్పిస్తోందని తెలిపింది. వచ్చే మూడు నెలల కాలంలో దేశంలో మరిన్ని ఉద్యోగావకాశాలు పెరగనున్నాయని తెలిపింది. దేశీయంగా అన్ని పరిశ్రమ రంగాలు ఏప్రిల్ - జూన్ నెలల కాలం మధ్య ఆరోగ్యకరమైన నియామకాలు చేపట్టనున్నాయని మ్యాన్‌పవర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సంజయ్ పండిట్ తెలిపారు. బలమైన దేశీయ వృద్ధి కారణంగా ఉద్యోగులు కూడా ఆశాభావంతో కనిపిస్తున్నారని, ఆర్థిక రంగం, బీమా, స్థిరాస్తి రంగాలతో పాటు మిగిలిన రంగాల్లో కూడా మెరుగైన అవకాశాలు కనిపిస్తున్నాయని పండిట్ తెలిపారు. 2008 సంవత్సరం తరువాత భారత్, అంతర్జాతీయంగా నియామకాల్లో పటిష్ఠమైన ప్రణాళికను కనబరిచిందని ఈ సర్వే తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మాసాల మధ్య ఫైనాన్స్, ఇన్స్యూరెన్స్, స్థిరాస్తి, ఉత్పత్తిరంగాలతో పాటు, మైనింగ్, నిర్మాణ రంగాల్లో మరిన్ని అవకాశాలు మరిన్ని పెరగనున్నాయని తెలిపింది. నియామకాల్లో ఆసియా పసిఫిక్ ప్రాంతాలు బలంగా ఉన్నాయని, ఒక్క జపాన్ దేశం మినహా అమెరికాలో కూడా మళ్లీ నియామకాల పర్వం మొదలైందని ఈ సర్వే తెలిపింది.



### కొనసా... గుతోన్న
# విద్యుత్ కేంద్రాల నిర్మాణం

- ఉన్న వాటిలో పూర్తిస్థాయిలో ఉత్పాదన లేదు
- కొత్తవాటి పనులు నత్తనడక సాగుతున్నాయి
- ఉత్పాదన లక్ష్యంపై దృష్టిపెట్టని ప్రభుత్వం
- కరెంటు కోతలు తప్పేదెప్పుడో...

హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో విద్యుత్ వినియోగం ఏడాదికేడాది గణనీయంగా పెరుగుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి, సరఫరా లేకపోవడంతో యథేచ్ఛగా విద్యుత్ సరఫరాలో కోత విధించాల్సి వస్తోంది. అయినప్పటికీ నిర్మాణంలో ఉన్న విద్యుత్ కేంద్రాలను సకాలంలో పూర్తి చేయడానికి ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం విద్యుత్‌రంగ స్థితిగతులు ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్నట్లుగా తయారయ్యాయి.

రాష్ట్రంలోని బొగ్గు, జల, గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాల పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం 12 వేల 427 మెగావాట్లు. దీనికి అదనంగా వచ్చే అయిదేళ్లలో మరో 10 వేల 992 మెగావాట్లను సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే ఈ దిశగా అడుగులు వేసిన దాఖలాలు లేవు. అందుబాటులో ఉన్న కేంద్రాలు పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పాదనను చేపట్టలేకపోతున్నాయి. కొత్తగా నిర్మాణంలో ఉన్న బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు సకాలంలో అందుబాటులోకి రావడం లేదు. గడువులోగా విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని పూర్తి చేసుకుంటే కొంతలో కొంతమేరకైనా డిమాండ్‌ను అందుకోవచ్చనే అభిప్రాయం విద్యుత్‌రంగ నిపుణుల్లో వ్యక్తమౌతోంది. ఈ దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి మొదలు పెట్టాల్సిన కొన్ని కేంద్రాలు ఇంకో ఆరు నెలలకైనా అందుబాటులోకి వస్తాయన్నది అనుమానమే. వరంగల్ జిల్లా భూపాలపల్లి వద్ద నిర్మితమవుతోన్న 500 మెగావాట్ల కాకతీయ థర్మల్ కేంద్రం స్టేజీ-1 కిందటి నెలలోనే పనులను పూర్తి చేసుకోవాల్సి ఉంది. అది సాధ్యపడలేదు. ఇప్పటికీ అక్కడ పనులు మందకొడిగానే సాగుతున్నాయి. ఈ కేంద్రంలో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయడానికి కనీసం ఆరునెలల సమయం పట్టవచ్చని తెలుస్తోంది. కూలింగ్ టవర్స్, ఇతర పైప్‌లైన్‌ల నిర్మాణం కొనసాగుతున్నట్లు సమాచారం. కడపజిల్లా ముద్దనూరు వద్ద ఉన్న రాయలసీమ థర్మల్ కేంద్రం యూనిట్-5 ఈ ఏడాది ఆగస్టు నాటికి అందుబాటులోకి రావాల్సి ఉంది. 210 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లో బాయిలర్ అమరిక, కూలింగ్ టవర్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్లాంట్‌కు సంబంధించిన కొన్ని ఇంజనీరింగ్ పనులు సైతం నత్తనడకనే సాగుతున్నాయి. కొత్తగూడెం థర్మల్ కేంద్రం స్టేజీ-6లో ఈ ఏడాది చివరినాటికి ఉత్పత్తి మొదలు కావాల్సి ఉంది. దీని ఉత్పాదక సామర్థ్యం 500 మెగావాట్లు. ఈ కేంద్రంలోనూ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. పవర్, సర్వీస్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లు ఇంకా కొనసాగుతూనే ఉంది. కాళేశ్వరం నదికి అనుసంధానం చేస్తూ పైప్‌లైన్ల నిర్మాణం ఇంకా పూర్తి కావాల్సి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాలా జల విద్యుత్ కేంద్రం యూనిట్-6 నిర్మాణ పనులు ఇంకా జరుగుతున్నాయి. ఈ ఏడాది జులై 10 నాటికి ఈ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన మొదలు కావాల్సి ఉంది. పనులు మాత్రం ఇప్పట్లో పూర్తయ్యేలా లేవు. ఈ కేంద్రం ఉత్పాదక సామర్థ్యం 39 మెగావాట్లు. 500 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మాణంలో ఉన్న డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం(వీటీపీఎస్) ఏడో యూనిట్ కిందటి నెల వరకూ సాంకేతిక లోపాలతో కొట్టుమిట్టాడిన విషయం తెలిసిందే. ఉత్పాదనకు ముందే ఈ యూనిట్‌లో మూడుసార్లు ప్రమాదాలు జరిగాయి. ఇదిలావుండగా, వచ్చే ఏడాది పూర్తి కావాల్సిన మరికొన్ని ప్రాజెక్టులు ఇంకో రెండేళ్లకు గానీ అందుబాటులోకి వచ్చే అవకాశాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని జెన్‌కో ఎలా అధిగమిస్తుందనేది ప్రశ్నార్థకం. అయిదేళ్లలో 10 వేల 992 మెగావాట్ల మేర అదనపు విద్యుత్ ఉత్పత్తి సాధించాల్సిన అత్యవసరం ఉన్నప్పటికీ ప్రభుత్వం దీనిపై శ్రద్ధాసక్తులు చూపించడం లేదు.



## దేశీయ మార్కెట్లో ఫోర్డ్ చిన్న కారు 'ఫిగో'



న్యూఢిల్లీ : అమెరికన్ ఆటోమొబైల్ దిగ్గజం ఫోర్డ్ సంస్థ దేశీయ మార్కెట్లోకి కొత్తగా 'ఫిగో'ను విడుదల చేసింది. ఫోర్డ్ సంస్థ ఉత్పత్తుల్లో చిన్న కార్ మోడల్ అయిన ఫిగో మార్కెట్ ధర 3.5లక్షల నుండి 4.48లక్షలుగా ఉండనుంది. ఫిగో కార్‌ను ఇక్కడి నుంచే విదేశాలకూ ఎగుమతి చేయనున్నమని ఫోర్డ్ సంస్థ తెలిపింది. ముందుగా దక్షిణాఫ్రికా దేశంతో మొదలు పెట్టి, ఆ తరువాత ఇతర దేశాలకు ఎగుమతి చేస్తామని పేర్కొంది. కొత్తగా విడుదలైన ఫిగో మోడల్ కారు1.2లీటర్, 1.4లీటర్ పెట్రోల్, డీజిల్ వర్షన్లలో అందుబాటులో ఉంది. ఎంట్రీలెవెల్ పెట్రోల్ వర్షన్ ఫిగో ధర 3.5లక్షలు కాగా, డీజిల్ కార్ ధర 4.48లక్షల రూపాయలుగా ఉంది. గత కొన్నాళ్ళుగా ఫోర్డ్ ప్రీమియం ఉత్పత్తులనే అందిస్తూ వచ్చిందని, దీనితో తమ మార్కెట్ వాటా దేశీయంగా 20శాతానికే పరిమితమైందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, (మార్కెటింగ్, సేల్స్ విభాగం) నిగెల్ వార్క్ తెలిపారు. అందుబాటు ధరతో విడుదలైన ఫిగో కారు అన్ని తరగతుల వినియోగదారులను ఆకట్టుకోగలదని అన్నారు. ఫిగో కారు ఎగుమతులకు భారత్ కేంద్రం కానుందని, పెట్రోల్ వర్షన్ ఫిగో కారు 15.6 కిలోమీటర్లు, డీజిల్ వర్షన్ 20 కిలోమీటర్లు మైలేజ్‌ను ఇస్తుందని పేర్కొన్నారు. ఫిగో కారు ఎగుమతి ముందుగా దక్షిణాఫ్రికాతో మొదలవుతుందని ఫోర్డ్ ఎండీ మైఖేల్ బోనెహమ్ అన్నారు. సుమారు 2లక్షల యూనిట్ల వార్షిక సామర్థ్యం గల తమ చెన్నై ప్లాంట్ ద్వారా ఫిగో ఉత్పత్తి అవుతుందని ఆయన తెలిపారు. 2007 సంవత్సరంలో చిన్న కారు ఫిగో తయారీ పనులు ప్రారంభించిన ఫోర్డ్ సంస్థ గత ఏడాది సెప్టెంబరులో పూర్తి చేసింది. ఈ ఏడాది కాంపాక్ట్ కార్ల విభాగంలో గట్టి పోటీ ఇవ్వనున్నామని సంస్థ సీఈఓ ఆలన్ ములల్లీ తెలిపారు. వచ్చే పదేళ్ళలో చిన్న కార్లకు భారత్‌లో రెండింతల వ్యాపారం జరగనుందని ఆయన అన్నారు. ఇప్పటివరకూ ఈ విభాగంలో 1.22 మిలియన్ యూనిట్ల విక్రయాలు జరగడంతో దేశీయంగా చిన్న కార్ల మార్కెట్ 72శాతంగా ఉంది.

## డాబర్ సంస్థకు అధిక రేటింగ్స్

న్యూఢిల్లీ : ప్రముఖ ఎఫ్‌ఎంజీజీ సంస్థ డాబర్ ఇండియాకు క్రెడిట్ రేటింగ్ సంస్థ క్రిసిల్ ట్రిపుల్ 'ఎ' రేటింగ్స్ స్థానాన్ని ఇచ్చింది. వ్యాపార వాణిజ్య విభాగాల్లో సుదీర్ఘకాల వృద్ధితో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నందుకు గాను ఈ రేటింగ్స్‌ను ప్రకటించింది. డాబర్ సంస్థకు ఇప్పటికే క్రిసిల్ డబుల్ 'ఎ' రేటింగ్‌ను ప్రకటించింది. ఇప్పుడు ఇంకా మెరుగైన రేటింగ్ స్థానాన్ని అందజేసిందని ఇక్కడ ఓ ప్రకటనలో డాబర్ సంస్థ తెలిపింది. ప్రస్తుత డాబర్ సంస్థకు మార్కెట్లో ఉన్న స్థానం, లాభాల వృద్ధి, విజయవంతమైన సమీకృత కార్యకలాపాలను పరిగణలోకి తీసుకుని ఈ గ్రేడింగ్‌ను ప్రకటించినట్టు తెలిపింది. క్రిసిల్ సంస్థ అందజేసిన రేటింగ్స్ తమ ఆత్మవిశ్వాసాన్ని, మార్కెట్ స్థానాన్ని మరింత పటిష్ఠపరుస్తాయని డాబర్ గ్రూప్ సంస్థ డైరెక్టర్ పీడీ నారంగ్ తెలిపారు. హెర్బల్ ఉత్పత్తుల విభాగంలో అగ్రస్థానంలో ఉన్న డాబర్ సంస్థ, తాజాగా డాబర్ సంస్థ ఫెమ్ కేర్ ఫార్మా సంస్థను కైవసం చేసుకుని కంపెనీ ప్రొఫైల్‌ను మరింత పటిష్ఠపరుచుకుంది.

## ఆస్ట్రేలియాకు ఐబిఎస్ రెండవ బ్యాచ్ విద్యార్థులు



ఆస్ట్రేలియాస్టడీ టూర్‌కు ఎంపికైన ఐబిఎస్ విద్యార్థులతో ఆర్.ఆర్.రెడ్డి, ఫ్రాంక్‌ఓ నెయిల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలోని అత్యుత్తమ బిజినెస్ స్కూళ్ళలో ఏడవ ర్యాంక్ పొందిన ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులు 30 మంది తాము చేస్తున్న పిజిపిఎం కోర్సులో భాగంగా ఆస్ట్రేలియా వెళతున్నారు. ఐబిఎస్ విద్యార్థులు ఈ విధంగా అంతర్జాతీయ అధ్యయనంలో పాల్గొనడం ఇది రెండవసారి. విద్యార్థుల ప్రయాణం, వసతి, బీమా ఖర్చులన్నింటిని ఐబిఎస్ భరించడం విశేషం. విద్యార్థులను అంతర్జాతీయ విద్య, వాణిజ్య వాతావరణానికి అలవాటు చేయడం, నైపుణ్యాలు పెంచుకోవడం, విదేశీ సాంస్కృతిక నేపథ్యాన్ని అధ్యయనం చేయడం ఈ విదేశీ యాత్ర లక్ష్యం. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐబిఎస్ రిజిస్ట్రార్ ఆర్.ఆర్.రెడ్డి మాట్లాడుతూ పిజిపిఎం విద్యార్థులు తమ కరిక్యులమ్‌లో ఒక సెమిష్టర్‌ను విదేశాలలో పూర్తి చేయడం ఒక భాగమని, ఆ క్రమంలో దక్షిణ ఆస్ట్రేలియా లోని ఐబిఎస్ అడెలాయిడ్ క్యాంపస్‌లో ఈ శిక్షణను పూర్తి చేస్తారని చెప్పారు. గతంలో తొలి బ్యాచ్ విద్యార్థులు 40 మంది తమ విదేశీ అధ్యయనాన్ని విజయవంతంగా పూర్తి చేసారని12 వారాల పాటు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలో మీడియాలో వచ్చినంతగా భారతీయ విద్యార్థులపై దాడులు జరగడం లేదని, అక్కడే వందలాది మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారని, విద్యార్జనలో భాగంగా ఆస్ట్రేలియా ఒక సెమిస్టర్ పూర్తి చేయడం వారికి వారికి అనేక రకాలుగా ఉపకరిస్తుందన్నారు. పూర్తిగా ప్రతిభ ప్రాతిపదికన అహ్మదాబాద్, చండీఘడ్, డెహ్రాడూన్, గురగావ్, ముంబాయి, నోయిడా, పూణెలోని ఐబిఎస్ క్యాంపస్‌ల నుండి విద్యార్థులు ఆస్ట్రేలియా టూర్‌కు ఎన్నికయ్యారని పిజిపిఎం కోర్సు తరువాత బ్యాచ్ వచ్చే జూన్ 1 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గతంలో విదేశీ సెమిస్టర్‌ను విజయవంతంగా పూర్తి చేసిన పలువురు విద్యార్థులు తమ అనుభవాలను వివరించారు. సమావేశంలో ఐబిఎస్ అడిలాయిడ్ ఛైర్మన్ ఫ్రాంక్‌ఓ నెయిల్ కూడా పాల్గొన్నారు.

## రూ.470 కోట్లతో హోండా మోటార్‌సైకిల్ రెండవ ప్లాంట్

న్యూఢిల్లీ : ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) తమ రెండవ ఉత్పత్తి కర్మాగారం కోసం 470 కోట్ల రూపాయల పెట్టుబడిని ప్రకటించింది. రాజస్థాన్‌లోని భివాడి దగ్గరలోని తపుకారా ప్రాంతంలో నెలకొల్పనున్న కొత్త ఉత్పత్తి ప్లాంట్ పనులు వచ్చే ఏడాదిలో చేపట్టనున్నామని సంస్థ తెలిపింది. ఈ ప్లాంటు ద్వారా ఏటా 22లక్షల యూనిట్ల సామర్థ్యాన్ని పెంచుకోనున్నట్టు హెచ్‌ఎంఎస్‌ఐ తెలిపింది. కొత్తగా నిర్మించనున్న ప్లాంటు కోసం 2.4లక్షల చదరపు మీటర్ల భూమిని హెచ్‌ఎంఎస్‌ఐ కైవసం చేసుకుంది. డిమాండ్ పెంచుకోవడానికి తమ రెండవ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని, మనేసర్‌లో గల కర్మాగారం ద్వారా వచ్చే ఏడాదికి 16లక్షల యూనిట్ల సామర్థ్యాన్ని చేరుకోనున్నట్లు ఈ మాసాంతానికి 15.5 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తి చేస్తామని సంస్థ తెలిపింది. తమ రెండవ ప్లాంటు అందుబాటులోకి వస్తే మొత్తం సంస్థ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 22 లక్షల యూనిట్లుగా నమోదవుతుందని హెచ్‌ఎంఎస్‌ఐ తెలిపింది.

## ముగిసిన ఎస్‌బీహెచ్ కళా ప్రదర్శన




హైదరాబాద్, బిజినెస్‌బ్యూరో: ప్రతిభావంతులైన చిత్ర కళాకారులను ప్రోత్సహించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ తన కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన మంగళవారం ముగిసింది. కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి ముగింపు కార్యక్రమంలో పాల్గొన్ని కళాకారులకు సర్టిఫికేట్లను అందచేశారు. బ్యాంక్ ఎండి రేణు చల్లు, ఐఏఎస్ అధికారిణి, ప్రముఖ చిత్రకారిణి చందనాఖాన్, బ్యాంక్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ. 40 వేల కోట్లు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం 2010-2011 సంవత్సరంలో పలు రంగాల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా 40వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని లక్ష్యంగా చేసుకున్నట్టు ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ శాఖ తెలిపింది. ఈ లక్ష్యాన్ని తప్పకుండా చేరు కుంటామని ఈ శాఖ కార్యదర్శి సుమిత్ బోస్ తెలిపారు. యూనియన్ బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ ప్రభుత్వ ఆదాయ మార్గాలను పెంచుకోవడానికి 25 కోట్ల రూపాయల పెట్టుబడుల లక్ష్యాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తాము ఇందుకు సంబంధించిన పరిస్థితులను, ప్రతిపాదనలను సమీక్షిస్తున్నామని బోస్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ ఇండియా, నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్, ఎన్‌టిపిసి, ఆర్‌ఇసి సంస్థల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం ఎన్‌ఎండీసీ ఫాలో-ఆన్-పబ్లిక్ ఆఫర్ ప్రారంభం అయింది. ఈ వరుసలో సట్లజ్ విద్యుత్ నిగమ్ సంస్థ ఉంది. క్యాబినెట్ నిర్ణయం ప్రకారం అన్ని లాభదాయక పీఎస్‌యూలలో పబ్లిక్ హోల్డింగ్ కనీసం 10శాతంగా ఉండాలి. అనేక పబ్లిక్ రంగ సంస్థలన్నీ మరి కొన్నాళ్ళలో లిస్టెడ్ కంపెనీలుగా మారనున్నాయి. లాభాలు ఆర్జిస్తున్న 60 ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడులు ఉపసంహరించనున్నారు. పెద్ద పబ్లిక్ రంగ సంస్థలైన కోల్ ఇండియా, బిఎస్‌ఎన్‌ఎల్, సెయిల్ వంటి సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ 2011-12 ఆర్థిక సంవత్సరంలో జరుగవచ్చునని సంబంధిత మాజీ కార్యదర్శి సునీల్ మిత్రా పేర్కొన్నారు.

## ఓఎన్‌జీసీ సెజ్ ప్రతిపాదన గుజరాత్ ఆమోదం

న్యూఢిల్లీ : చమురు, సహజ వాయువు సంస్థ (ఓఎన్‌జీసీ) తన పెట్రో కెమికల్ యూనిట్ల ఏర్పాటు కోసం గుజరాత్‌లో ప్రత్యేక ఆర్థిక మండలిలో స్థలం కోరుతూ చేసిన అభ్యర్థనను గుజరాత్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గుజరాత్‌లోని బారుఖ్ ప్రాంతంలో ప్రతిపాదించిన ఈ సెజ్ కొరకు 1500 హెక్టార్ల స్థలాన్ని కేటాయించారు. వివిధ రకాల పెట్రోకెమికల్ యూనిట్లకు ఈ సెజ్ బాధ్యత వహించనుంది. ఈ సెజ్‌లో 50-60 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఓఎన్‌జీసీ ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు విలువ మొత్తం 295 కోట్ల రూపాయలు. ఫార్మాస్యూటికల్ సంస్థ అహ్మదాబాద్ ప్రాంతం సెజ్‌లో సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ చేసిన ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించలేదు. వృధా నీటి వినియోగంపై సంస్థ సరిగ్గా స్పందించ నందున ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్లు అధికారులు తెలిపారు.

## కర్ణాటక టూరిజంపై రూ.20వేల కోట్ల పెట్టుబడులు



బెంగళూరు : ప్రయివేటు రంగ పెట్టుబడులను ఆకర్షించేందుకు కర్ణాటక ప్రభుత్వం కొత్త టూరిజం మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయనుంది. సుమారు 10వేల కోట్ల రూపాయల నుంచి 20వేల కోట్ల రూపాయల పెట్టుబడులను పెట్టనున్నట్లు తెలిపింది. మరో రెండు నుంచి ఐదు సంవత్సరాల్లో టూరిజం పరిశ్రమలోకి 2లక్షల ఉపాధి అవకాశాలు రానున్నాయని కర్ణాటక టూరిజం మంత్రి గాలి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ శాఖ లో అంతర్గత క్రమశిక్షణను మెరుగుపరుచుకోవడం ద్వారా అభివృద్ధికి కృషి చేయనున్నామని, రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను సృష్టించడం, నగరాలు, పార్కుల పై పెట్టుబడులు, టూరిస్టుల రక్షణ, టూరిజం రంగానికి సంబంధించిన ప్రత్యేక అవసరాలను గుర్తించడం లాంటివి ఇందులో భాగమని తెలిపారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు.

## సౌదీలో 'కాయ' క్లీనిక్కులు

ముంబాయి : దేశీయ ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ సంస్థ మారికో, తమ కాయా క్లీనిక్‌లను సౌదీ అరేబీయాలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. వచ్చే ఏడాది నాటికి 4 నుంచి 5 కాయా క్లినిక్‌లను సౌదీలోని ఉత్తర మధ్య ప్రాంతంలో ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. రానున్నఆర్థిక సంవత్సరానికి ఎలాంటి విస్తరణా ప్రణాళికలను చేపట్టలేదని మారికో సంస్థ ఛైర్మన్ హర్ష్ మారివాలాతెలిపారు. ప్రస్తుతం భారత్‌తో పాటు ఇతర దేశాల్లో మొత్తం 101 కాయా క్లినిక్‌లు పని చేస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యంతో పాటూ చర్మ సౌందర్య సేవలను కాయా క్లినిక్‌లు అందిస్తున్నాయి. త్వరలో హిమాచల్‌ప్రదేశ్‌లో తమ కొత్త ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించనున్నామని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేదు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో తమ ఉత్పత్తుల విభాగంలో 8 నుంచి 10శాతం వృద్ధిని ఆశిస్తున్నట్టు తెలిపారు.

## రూ.1800 కోట్లతో సోనీ ప్రచార కార్యక్రమాలు

న్యూఢిల్లీ : కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సోనీ ఇండియా తమ ఉత్పత్తుల ప్రచార కార్యక్రమాల కోసం రూ.1800కోట్ల పెట్టు బడులను వచ్చే ఏడాదిలోగా పెట్టనున్నట్లు ప్రకటించింది. సంస్థ ఉత్పత్తులపై అవగాహన, మార్కెటింగ్, ప్రచారం కొరకు ఈ పెట్టుబడులు ఉపకరిస్తాయని భావిస్తోంది. ఈ సంవత్సరంలో ఫ్లాట్ టెలివిజన్‌ల విక్రయాలను రెండింతలుగా చేసుకునే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, దీంతో ప్రచార కార్యక్రమాలకు కూడా రెండింతలు వ్యయం చేయనున్నామని సోనీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మసారు తమగవా ఇక్కడ తెలిపారు. ఈ ఏడాది 3500కోట్ల రూపాయల సంస్థ టర్నోవర్‌కు బ్రావియా టెలివిజన్ సెట్ల విక్రయాలు మూడోవంతు సహకారాన్ని అందించాయని, ఒక్క బ్రావియా టీవీల ప్రచారం కోసమే 700కోట్ల రూపాయల పెట్టుబడిని పెట్టామని వివరించారు. గత ఏడాది 400 పైగా బ్రావియా టీవీల విక్రయాలను జరిపామని, ప్రస్తుతం ఈ విక్రయాలను రెట్టింపు చేసుకునే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. ఈ ఏడాది 30శాతం మార్కెట్ వాటాను ఆశిస్తున్నామని ఆయన అన్నారు.

# సోజిత్ ఆరోపణలు ఖండించిన పృథ్వీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సోజిత్ సంస్థను తాము మోసం చేసినట్లుగా వివిధ పత్రికలు, ఛానల్స్‌లో వచ్చిన వార్తలు ఆధారం లేనివని, కేవలం తమ సంస్థ కీర్తి ప్రతిష్టలు దెబ్బతీయడానికి అభూత కల్పనలకు ఆస్కారమిస్తూ ఈ రకంగా ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పృథ్వీ ఇన్ఫర్మేషన్ సొల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తమ తరుపు న్యాయవాదులు పి.రవిప్రసాద్, ఎం.వి. రావులతో కలసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2007-08 సంవత్సరంలో హ్యూవాయ్ టెక్నాలజీస్ రూపొందించిన సాంకేతిక సామాగ్రి, ఉపకరణాలను ప్రభుత్వ రంగంలోని బిఎస్‌ఎన్‌ఎల్‌కు సరఫరా చేయడానికి తాము సొజిత్‌తో కలసి ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని, మొత్తం రూ.260 కోట్ల కాంట్రాక్ట్ విలువలో సోజిత్ తాము కలసి రూ.193 కోట్ల విలువైన సాంకేతిక పరికరాలు సరఫరా చేయవలసి ఉందని చెప్పారు. అయితే ఒప్పందంలో సోజిత్ మోసాలకు పాల్పడడం వల్ల ఆ కాంట్రాక్ట్ రద్దు కావడంతో పాటు, డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్‌ఐ) విచారణను ప్రస్తుతం ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ విచారణ ఆలస్యం కావడం వల్ల ఖాతాదారు నుండి నగదు చెల్లింపులలో విపరీతమైన జాప్యం జరిగిందని, ఇందువల్ల తమకు రూ.97 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోజిత్ కూడా డిఆర్‌ఐ నుండి షోకాజ్ నోటీసులు అందుకుందని, వ్యాపారం ఒప్పందం వల్ల తమకు కలిగిన నష్టాన్ని సోజిత్ దృష్టికి తాము తీసుకువెళ్ళినప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, వివాదంలో రూ.30 కోట్లు పరిష్కారమయ్యాక, మిగిలిన మొత్తం చెల్లింపు కూడా సక్రమంగా జరగాలని తాము అభ్యర్థించామని, కాని దానిని సోజిత్ పెడచెవిన పెట్టిందని విమర్శించారు. ఇంకా ఎస్క్రో ఖాతాలో రూ.13 కోట్లు ఉన్నాయని, ఖాతాదారుల నుండి ఇంకా రూ.30 కోట్ల చెల్లింపులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కింద కేసు ప్రస్తుతం లండన్ కోర్టు విచారణలో ఉందని, అలాగే దేశీయ న్యాయస్థానాలలో కూడా విచారణ జరుగుతోందని ఈ నేపథ్యం లో తమ పరువు ప్రతిష్టలు దెబ్బతినేవిధంగా వ్యవహరిస్తూ, సోజిత్ అసత్య ఆరోపణల బురద జల్లు తూ బజారుకెక్కడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సోజిత్‌పై కూడా తాము క్రిమినల్ కేసులు దాఖలు చేశామని, వాటిని కప్పిపుచ్చి తప్పంతా తమదే అన్నట్లు




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌కుమార్ (మధ్యలో) చిత్రంలో న్యాయవాదులు ఎం.వి.రావు, రవి ప్రసాద్‌లు ఉన్నారు.

వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒప్పందాన్ని పక్కన బెట్టి అన్యాయంగా తాము నిధులు కాజేసామని సోజిత్ చేస్తున్న విష ప్రచారం దురదృష్టకరమని, సోజిత్ కు తాము చేసిన చెల్లింపు వివరాలు ఖాతాపుస్తకాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో తాము సోజిత్ చేసుకున్న ఒప్పందాలు సక్రమంగా జరిగాయని, 2013 నాటికి ఒక బిలియన్ డాలర్ కంపెనీగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు పోతున్న తమను, వ్యాపారంలో సహజంగా ఉండే స్పర్థలతో పోటీదారులతో చేతులు కలిపి సోజిత్ దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తమ సంస్థపై వస్తున్న అవాస్తవాలను వాటాదారులు, ఖాతాదారులు, సిబ్బంది, ఇతర భాగస్వాములు నమ్మరాదని ఈ సందర్భంగా తాము విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తమకు ద్రోహం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నామని వివరించారు. టెలికాం ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఎంటర్‌ప్రైస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఔట్ సోర్స్‌డ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, బిజినెస్ ఇంటెలిజెన్స్, ఈ-గవర్నెన్స్, మొబైల్ ఫ్లాట్‌ఫారం సేవలను పృథ్వీ అందిస్తోంది.

## రోటరీ కంప్రెషర్ ప్రారంభించిన పెన్నార్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కేవలం మూడు నెలల వ్యవధిలో గృహ నిర్మాణ అవసరాల కోసం ఉపయోగించే రోటరీ కంప్రెషర్‌ను పెన్నార్ పరిశ్రమలు సమకూర్చుకుంది. జపాన్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యూజీ మెటల్ దీనిని తయారు చేసింది. ఈ కంప్రెషర్ల వల్ల తక్కువ ఖర్చు, స్థలంతో నాణ్యతాయుతమైన ఎయిర్ కండిషనర్లను పనిచేయించవచ్చు. గడ్డు వాతావరణ పరిస్థితులలో కూడా శబ్దం లేకుండా ఏసిలను పనిచేయించవచ్చు. దీంతో ఏడాదికి ఏడు లక్షల గృహాలను నిర్మించే సత్తాను పెన్నార్ కలిగినట్లయింది. పూర్తి స్థాయి సామర్థ్యాన్ని మరో ఆరు నెలల్లో చేరుకోవచ్చని ఈ సంస్థ భావిస్తోంది. రానున్న రోజుల్లో ఈ కంప్రెషర్లకు భారీ డిమాండ్ ఉండవచ్చునని పెన్నార్ భావిస్తోంది.

## ఆర్‌కామ్ నుండి కొత్త అప్లికేషన్

న్యూఢిల్లీ : రిలయన్స్ కమ్యూనికేషన్స్ సంస్థ 'సోషల్లీ' అనే కొత్త వాస్ అప్లికేషన్‌ను ఇక్కడ విడుదల చేసింది. రిలయన్స్ కమ్యూనికేషన్ వరల్డ్ ఔట్‌లెట్ల ద్వారా ఈ కొత్త అప్లికేషన్ అందుబాటు లోకి వస్తుందని సంస్థ ప్రకటించింది. ఫేస్‌బుక్, ట్విట్టర్, లింక్‌డ్‌ఇన్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లను ఈ అప్లికేషన్ ద్వారా సందర్శించవచ్చని తెలిపింది. ఈ 3జీ అప్లికేషన్ ద్వారా ఇన్‌కమింగ్ కాలర్‌కు సంబంధించిన పూర్తి సమాచారం, మిగతా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ల తాజా వివరాలు స్మార్ట్‌ఫోన్ అలర్ట్‌ల ద్వారా ఖాతాదారులకు అందుబాటులోకి వస్తాయని కంపెనీ తెలిపింది. ఈ కొత్త అప్లికేషన్ సేవల ద్వారా రిలయన్స్ ఫోన్ అడ్రస్ బుక్ మరింత శక్తివంతంగా తయారవడమే కాకుండా ఇతర సోషల్ నెట్‌వర్క్ సైట్లను వంటి సైట్లను పంచుకోవచ్చని ఆర్‌కామ్ (వాస్) హెడ్ క్రిష్ణ దుర్బా తెలిపారు. భవిష్యత్‌లో ఈ సౌకర్యాన్ని అన్ని వీడియో కాల్స్ కూడా జతపరుస్తామని ఆమె అన్నారు. స్నేహితుల తాజా సమాచారాన్ని ఈ అప్లికేషన్ ద్వారా పొందవచ్చని ఆమె అన్నారు. ఆర్‌కామ్ సంస్థ సౌజన్యంతో ఈ 3జీ సోషల్ సైట్ సర్వీసు ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు.